


## మళ్ళీ చెప్పిన కథలు

# గొర్రెల కాపరి - తోడేలు

### రావి కొండలరావు

**అటు అరణ్యానికి ఇవతల - ఇటు ఊరికి అవతల ఉన్న మధ్యప్రదేశ్. అక్కడ కొందరు పొలాల్లో పనులు చేసుకుంటూ ఉంటారు. కొందరు పశువుల్ని మేపుకుంటూ ఉంటారు. నున్నగా కనిపించే దూరపు కొండలతోనూ, సన్నగా కనిపించే దగ్గర చెట్లతోనూ పచ్చగా, చల్లగా ఉంటుంది అక్కడి వాతావరణం.**

ఆ వాతావరణంలో గొర్రెల్ని మేపుతూ ఉంటాడో అబ్బాయి. ఆవుల్ని మేపేటప్పుడయితే మురళి ఊదుతూ ఉండొచ్చు. గొర్రెలకయితే అక్కర్లేదు. మరి, ఆ అబ్బాయికేం తోస్తుంది? అందుకని ఏదో అల్లరిచెయ్యడం వాడి అలవాటు. అల్లరి చేయడం అంటే చిన్నఅబద్ధం ఆడడం. సరదాకి అబద్ధం ఆడితే అది అల్లరి. పెద్దఅబద్ధం అయితే అది మోసం. మోసంచేసేవాళ్ళు ఆడేవి అబద్ధాలు. ప్రజలకి అబద్ధాలు చెప్పి గద్దె ఎక్కేవాళ్లు మోసాలూ చేస్తారు. పెద్దపెద్ద అబద్ధాలూ ఆడతారు. "గొర్రెల్ని తినువాడు గోవింద కొడతాడు, బర్రెల్ని తినువాడు వస్తాడయ్యా!" అన్నట్టు ఒకర్ని మించి ఒకరు. ఈ గొర్రెల్ని మేపువాడు, కాచువాడూ అలాంటివాడు కాడు. వీడికేదో వినోదం కావాలి. అబద్ధం ఆడతాడు. 'అబద్ధం ఆడుట' అన్నారని, వీడికది 'ఆట' అయింది. ఆ ఆటలో ఉన్నట్టుండి "పులొచ్చింది - పులి వచ్చింది! బాబోయ్, రక్షించండి!" అని అరుస్తాడు. ఆ అరుపులకి పక్క పొలాల్లో పనులు చేసుకుంటున్న వాళ్లు పారా పలుగూ పట్టుకుని పరుగు పరుగున వేస్తారు. వాళ్ల ఆత్రుతా, ఆదుర్దా, ఆవేశం చూసి గొర్రెలకాపరి పకపకా నవ్వుతాడు -

టాక్స్ కట్టకుండా వినోదం పొందినందుకు.

అలాగే జరిగిన ఇంకో రోజు -

"ఏదిరా పులి?"

"పులీ లేదు, పురుగూ లేదు. ఊరికే, సరదాకి, వేళాకోళానికి, నేను నవ్వుకోడానికీ మిమ్మల్ని ఏడిపించడానికీ!" అన్నాడు వాడు నవ్వుతూనే.

"ఒరేయ్! ఇక మీద మళ్లీ ఎప్పుడైనా ఇలాంటి తమాషాలు చేశావా, ఊరుకోం, నీ తోలుఒలిచి డప్పు కట్టించి, అది వాయించుకుంటూ ఊరేగుతాం, జాగ్రత్త!" అని పొలం వెళ్లిపోయారు. వాళ్ల హెచ్చరిక ప్రకారం ఓ నాలుగురోజులపాటు వాడు ఊరుకున్నాడు. కానీ వాడి బుద్ధి మాత్రం ఊరకోలేదు. ఏదో ఒకటి చెయ్యాలి. వాళ్లు పరుగెత్తుతూ రావాలి, తను పకపకా నవ్వాలి. 'సింహం! సింహం!' అంటే రారు. నక్కా, ఏనుగూ అంటే? అన్నారారు. ఈ ప్రాంతంలో పులులే తిరుగుతూ ఉంటాయి గనక 'పులి!' అంటేనే నమ్ముతారు. ఈసారి ఇంకా జోరుగా, హోరుగా అరిచి భయపెడదాం అనుకున్నాడు.

"పులి! పులి! పెద్ద పులి! బాబోయ్, పేద్ద పులి ... రక్షించండి! రక్షించండి!" అని ఓవర్ యాక్షన్ చేసే నటుడిని మించి, స్థాయిపెంచి, గొంతు చించి అరిచాడు. ఈసారి కేకలు భయంకరంగా, నిజం అనిపించేలా ఉన్నాయని పెద్దలంతా పరుగున వచ్చారు పలుగులతో. వాళ్లు పులి కోసం చూశాడు. వీడు వాళ్ల కోసం చూశాడు. నవ్వుతో వీడికి పొట్ట పగిలింది, కోపంతో వాళ్లకి మాట పెగిలింది.

"మళ్లీ మోసం చేశావురా, దౌర్భాగ్యుడా! నీ కిదే శాస్తి, అనుభవించు!" అని నలుగురూ ఎనిమిది చేతులా పట్టి షడ్రసోపేతమైన విందుభోజనం వడ్డించారు. పకపకామన్నవాడు, లబోదిబోమనడం ఆరంభించాడు.

"ఇంకెప్పుడు చెయ్యవు కదా! ఇలాంటి నాటకాలు ఆడవు కదా!" అని మళ్లీ మళ్లీ కొట్టారు.

"చెయ్యను, బాబోయ్ చెయ్యను గాక చెయ్యను! బుద్ధొచ్చింది. చెయ్యనంటే చెయ్యను. చచ్చినా చెయ్యను, బతికినా చెయ్యను. నన్ను బాదకండి!" అని వాడు కాళ్లా వేళ్లా పడి బతిమాలాడు. వాడి ఏడుపుచూసి వాళ్లు కరిగి, హెచ్చరించి పొలాలకరిగారు.

గొర్రెలకావరి ఎన్నికల్లో చావుదెబ్బతిన్న అభ్యర్థిలా నేలకి ఒరిగిపోయాడు. ఒళ్లు హూనమై పోయింది. వాడు ఏడుస్తూ ఉంటే గొర్రెలన్నీ దీనంగా చూశాయి.

"ఛీ! ఛీ! ఇంకెప్పుడూ ఇలా చెయ్యకూడదు. చెయ్యను గాక చెయ్యను! అమాయకులైన ఓ గొర్రలమందా! మీమీద ఒట్టు. మీ ప్రాణంమీద ఒట్టు. ఇంకెప్పుడూ ఇలాంటినాటకాలు కాదు కదా, చిన్న చిన్న నాటికలు కూడా ఆడను. మీరే సాక్ష్యం!" అన్నాడు కాపరి నిబ్బరంగా, గంభీరంగా. విచారంగా వింటున్న గొర్రెలన్నీ సంతోషంగా చూశాయి.

కొన్నాళ్ల తర్వాత, దాని సుముహూర్తాన, గొర్రెల దుర్ముహూర్తాన నిజంగానే నిదానంగా విచ్చేసింది పులి. వచ్చి, అటూ ఇటూ చూసి అందుబాటులో ఉన్న ఓ గొర్రెని వాటేసుకుంది. గొర్రె బ్యార్ బ్యార్‌మని అరుస్తూ భోరుమంది. ఐక్యతాభావం గల జంతువులు కనుక, తక్కిన గొర్రెలన్నీ గోలా గగ్గోలూ చేశాయి. కాపరి చూసి, కంగారుగా ఇష్ ఇష్ అన్నాడు కానీ, లాభం లేకపోయింది.

"పులి! పెద్ద పులి! నిజంగానే పులి ... రండి! రక్షించండి! పులి!" అని గట్టిగా కేకలు పెట్టాడు. పొల్లాల్లో ఉన్నవాళ్లు ఆ కేకలు విన్నారు కానీ, వినిపించు కోలేదు.

"వాడికింకా ఆ బుద్ధి పోలేదు! పుడకల్తో కానీ పోదు!" అని వ్యాఖ్యానాలు చేసి వాళ్ల పనుల్లో వాళ్లు మునిగిపోయారు.

గొర్రెని కావలించుకున్న పెద్ద పులి దాన్ని బరబరా ఈడ్చుకుపోయింది అడవిలోకి - బందిపోటుదొంగ అరణ్యరక్షకుల్ని ఎత్తుకుపోయినట్టు. కాపరి లబోదిబోమన్నాడు. ఏడ్చి మొతుకున్నాడు. ఎవరూ సహాయానికి రాలేదు.

"నాకు తగిన శాస్తి జరిగింది, కావాల్సిందే!" అని నెత్తీ నోరూ కొట్టుకున్నాడు నిస్సహాయంగా.

గొర్రెని ఈడ్చుకుపోతున్న పులి, కొంతదూరం వెళ్లేసరికి 'పులిమీద పుట్ర'అన్నట్టు ఇంకో పెద్ద పులి ఎదురైంది. పులినీ, గొర్రెనీ తీండ్రించి చూసి, తీవ్రంగా గాండ్రించి స్వజాతి సంపాదించుకున్న ఆహారంమీద పడింది. అంతే! రెండు పులులూ గొర్రె కోసం కొట్టుకోడంలో, అరదెబ్బతిన్న గొర్రె నెమ్మదిగా జారి, కుంటుకుంటూ పారిపోవడం పులులు గమనించలేదు.

దెబ్బతిన్న గొర్రె గోలుగోలున అరుస్తూ శరీరాన్ని ఈడ్చుకుంటూవచ్చి మందలో కలిసింది. "నా గొర్రె! నా గొర్రె!" అంటూ కాపరి కావలించుకున్నాడు.

"ఎంత సాహసివే! ఎంత ధైర్యశాలివే! ఆహా! నీ మెడలో కీర్తిచక్రం వెయ్యాలి. నీకు 'సాహస గొర్రె' అని బిరుదు ఇవ్వాలి!" అంటూ స్తుతించి, దాన్ని తీసుకుని పెద్దమనుషుల దగ్గరకెళ్లాడు.

"చూశారా పెద్దల్లారా! పులొచ్చింది పులొచ్చిందని అరిచాను. గొర్రెను ఎత్తుకు పోతోందని అరిచాను. నేను నిజం చెప్పినా మీరెవరూ రాలేదు. పులి వచ్చి ఈ గొర్రెను ఎత్తుకుపోయిందా - ఇది దాంతో పోట్లాడి, తప్పించు కొచ్చింది. మీరెవ్వరూ చెయ్యకపోయినా దానికదే సహాయం చేసుకోగలిగింది. చూడండి, దాని ఒంటినిండా పులిగాట్లూ, గాయాలూ!" అని చూపించాడు. రైతులందరూ ఆ గాయాలు చూశారు, వాణ్ణి చూశారు. వాళ్లు ఒకర్నొకరు చూసుకున్నారు.

"ఓరి అబద్దాలకోరూ! ఇలా కూడా నాటకాలు ఆరంభించావన్నమాట! పులి వచ్చిందా! దీన్ని ఎత్తుకెళ్లిందా! ఇది తప్పించుకొచ్చిందా! ... ఎవరి దగ్గర చెప్తావురా కథలు! నువ్వే పాపం దానికాలు కొరికి, దెబ్బలు కొట్టి మమ్మల్ని నమ్మించాలనుకుంటున్నావా! నిక్షేపంలాంటి గొర్రెని హింసిచావు కదరా! మళ్లీ నాలుగు తగిలించి కాళ్లూ చేతులూ విరిచేస్తే గానీ నీకు బుద్ధి రాదు!" అంటూ వాళ్లు 'అష్టోత్తర' తిట్లతో బడితెపూజ చేశారు - "మళ్లీ అబద్ధం ఆడవు కదా!" అంటూ.

"నేను నిజమే చెప్తున్నాను. అబద్ధం చెప్పలేదు. నా మాట నిజం! నన్ను నమ్మండి!" అని వాడు అరుస్తున్నా వాళ్లు ఊరుకోలేదు. చింతగింజల్ని చిదగ్గొట్టినట్టు చిదగ్గొట్టి, పొలం గట్టుమీద తోసి పారేసి, గొర్రెని తీసుకుని వైద్యుడి దగ్గరకి పరుగెత్తారు.

"హమ్మో ... అమ్మో! ఎంత మొత్తుకున్నా నమ్మరేం! అవున్లే, ఒకసారీ రెండుసార్లూ అబద్ధం చెప్పినవాడు నిజం చెప్పినా అది అబద్ధమే అవుతుంది. ఈ నీతి మీరు కూడా గుర్తుపెట్టుకోండి గొర్రెల్లారా! మీరు అబద్ధాలూ చెప్పరు, నిజమూ పలకరు. మీకు చక్కగా, మాట లేకుండా చేశాడు దేవుడు. ఓ దేవుడా! వచ్చే జన్మలో నన్ను కూడా ఇలా గొర్రెగానే పుట్టించు!" అన్నాడు పైకి చూస్తూ.

వాడి చుట్టూ చేరి దీనంగా చూస్తున్న గొర్రెలన్నీ ఈ మానవుడు తమ జాతిలో చేరబోతున్నందుకు సంతోషించాయి.

---

### మాటమీద...

**వంశీ:** అమ్మా! మా టీచర్‌కు మాట నిలకడ లేదు.

తల్లి: ఎందుకురా...ఏమయింది?

వంశీ: ఒకసారి రెండూ మూడూ కలిపితే అయిదు అంటుంది. ఇంకోసారి నాలుగూ ఒకటీ కలిపితే అయిదు అంటుంది.

**- చందూ వంశీ**, నంద్యాల